సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 28 । మే । 2024



లోయలో పడిన ఆటో

సీతంపేట సమీపంలో ఓ ఆటో లోయలో పడింది. 16 మంది గాయపడ్డారు.

- 8లో



గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

నరసన్నపేటలోని పాత వస్తువుల గోడౌన్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. రూ.50 లక్షల ఆస్తినష్టం జరిగింది.

- 8లో

3000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొత్తూరు: ఇరపాడు కొత్తగూడ గిరిజన గ్రామం సమీపంలో సోమవారం స్థానిక సెబ్ స్టేషన్ సీఐ బి.జయరామ రెడ్డి తన సిబ్బందితో నాటుసారా బట్టీలపై సోమవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో నాటు సారా తయారీకి ఉపయోగించే పులిసిన బెల్లం ఊట 3000 లీటర్లను ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మరో 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ డి.గంగాధరం ఆదేశాల మేరకు సారా బట్టీలపై దాడులు చేసినట్లు సీఐ తెలిపారు.

న్యూస్‌రీల్

ఉమారుద్రునికి విశేష పూజలు



పూల అలంకరణలో ఉమారుద్ర కోటేశ్వర స్వామి

శ్రీకాకుళం కల్చరల్: నాగావళి తీరంలోని ఉమా రుద్ర కోటేశ్వర స్వామికి వైశాఖ సోమవారం సందర్భంగా విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో స్వామివారి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పూజలు, విశేష హారతులు ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులతో ఆలయం కళకళలాడింది.

శక్తి ఆంజనేయ స్వామికి కరెన్సీతో అలంకరణ



కరెన్సీ నోట్ల అలంకరణలో శక్తి ఆంజనేయ స్వామి

నరసన్నపేట: స్థానిక పెద్దపేట కూడలిలో ఉన్న శక్తి ఆంజనేయ స్వామికి హనుమద్ జయంతి మహోత్సవాల సందర్భంగా రూ.1,11,111తో సోమవారం అలంకరించారు. కొత్త నోట్లను మాలగా చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వనమాలి శివశంకర వరప్రసాద్ ఆధ్వర్యంలో ఈ అలంకరణ నిర్వహించారు. జూన్ ఒకటిన హనుమద్ జయంతిని నిర్వహిస్తున్నామని, మే 31న శోభాయాత్ర ఉంటుందన్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొనాలని కోరారు.

హెల్త్ ఆఫీసర్‌ని సన్మానించిన యువత



హెల్త్ ఆఫీసర్‌ని సన్మానిస్తున్న యువత

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): క్లీన్ శ్రీకాకుళం–గ్రీన్ శ్రీకాకుళం అనే నినాదంతో నాగావళి నదిని క్లీన్ చేసేందుకు ప్రోత్సహించిన మున్సిపాలిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటరావుని యువకులు సన్మానించారు. నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఈవెంట్ ఆర్గనైజర్స్ క్లీన్ శ్రీకాకుళం అడ్మిన్ జీవన్, మనీ హంట్ శ్రీకాకుళం అడ్మిన్ హరీష్, హలో సిక్కోలు అడ్మిన్ ప్రశాంత్, శ్రీకాకుళం హవా అడ్మిన్ మధు, శ్రీకాకుళం ఎక్స్‌ప్లోర్ అడ్మిన్ సాయి ప్రణీత్ ఉన్నారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ యువత ఇలాంటి కార్యక్రమాలు చేయాలని నిర్ణయించడం చాలా సంతోషదాయకమని, ముమ్ముందు ఇలాంటి మంచి కార్యక్రమం చేసేవారికి మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన శిబిరాలు పూర్తి

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై నిర్వహించిన మూడు రోజుల అవగాహన కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ అధ్యక్షులు పి.జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అందరూ శిక్షణలో మంచి ప్రతిభ కనబరిచారని అభినందించారు. శిక్షణలో ఉత్తీర్ణులైన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లా నలుమూలల నుంచి 30 మంది అభ్యర్థులు శిక్షణలో పాల్గొన్నారు. డాక్టర్ శ్రీకాంత్, ట్రైనర్ జి.రమణలు అన్ని విషయా లు వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, ట్రెజరర్ కె.దుర్గా శ్రీనివాస్, ఎంసి సభ్యులు, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవిత



భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలుగల పిల్లలను పరిశీలిస్తున్న సహిత విద్య కోఆర్డినేటర్ బి.గోవిందరావు

- భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్యాబుద్ధులు
- జిల్లాలో ఇంటింటి సర్వే చేపడుతున్న సమగ్రశిక్ష అధికారులు, సిబ్బంది
- ఇప్పటి వరకు 480 మంది ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు
- సర్వేలో రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిచిన శ్రీకాకుళం

శ్రీకాకుళం న్యూకాలనీ, నరసన్నపేట : ప్రత్యేక అవసరాల పిల్లల బంగారు 'భవిత'కు ప్రభుత్వం బాటలు వేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఇంటింటా సమగ్రంగా సర్వే నిర్వహిస్తోంది. జిల్లాలో ప్రత్యేక అవసరాలుగల పిల్లలను గుర్తించి వారిని బడిబాట పట్టించే దిశగా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. సరైన అవగాహన, చైతన్యం లేక నాలుగు గోడలకే పరిమితమై.. చదువులకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. సహిత విద్య రిసోర్స్ పర్సన్లు గ్రామాల్లోని సచివాలయ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ సిబ్బంది సహకారంతో ఇంటింటికి వెళ్లి ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్నారు.

శ్రీకాకుళమే ఫస్టు..బెస్టు

ఇప్పటికే ప్రారంభమైన ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు ఈ సర్వే జిల్లాలో శరవేగంగా కొనసాగుతోంది. వచ్చే నెల 9వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగుతుంది. ఇప్పటి వరకు పాఠశాలలో చేరని పిల్లలతో పాటు మధ్యలో విద్యకు దూరమైన వారి వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 480 మంది పిల్లలను గుర్తించి.. రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా మొదటిస్థానంలో నిలిచింది. చదువు వల్ల ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సదుపాయాల గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తూ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులను ఒప్పించి వారిని బడి బాట పట్టిస్తున్నారు. సమగ్ర శిక్ష ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వ హిస్తున్న భవిత కేంద్రాలు విభిన్న ప్రతిభా వంతులు బంగారు భవిష్యత్‌కు బాసటగా నిలుస్తున్నాయి.

జిల్లాలో 30 భవిత కేంద్రాలు..

జిల్లాలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్యా బోధన కోసం 30 భవిత కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటి పరిధిలో మొత్తం 4450 మంది పిల్లలు చదువుతున్నారు. వారిలో 725 మంది జిల్లాలోని 300 భవిత సెంటర్లలో విద్యనభ్యసిస్తున్నారు. ఈ ఏడాది నిర్వహిస్తున్న సర్వేలో ఇప్పటికి 480 మంది ప్రత్యేక అవసరాలుగల వారిని గుర్తించారు. వారికి సాధారణ విద్యార్థులతో పాటు విద్యాబుద్ధులు నేర్పిస్తారు. ఇందుకోసం ప్రత్యేక శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్లు భవిత కేంద్రానికి ఇద్దరు చొప్పున పాఠాలు బోధిస్తున్నారు.

భవిత కేంద్రాలతో ప్రయోజనాలు బోలెడు..

- సమగ్ర శిక్ష ద్వారా ఈ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఎన్నో సదుపాయాలు, వసతులు, రాయితీలు, రవాణా చార్జీలను అందిస్తూ ఉచిత విద్యను అందించేలా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుంది. రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసేబుల్డ్ చట్టం 2016 ద్వారా 21 రకాల వైకల్యాలను గుర్తించారు.
- భవిత కేంద్రాల్లో వారానికి నాలుగు రోజుల చొప్పున ఫిజియోథెరపీ చేయిస్తారు.
- ప్రవేశాలు పొందిన బాలబాలికలకు భవిత కేంద్రాల ద్వారా ఉచిత పరికరాల పంపిణీకి వైకల్య నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు.
- భవిత కేంద్రాల్లో చేరిన వారికి రూ.25 వేలు విలువ చేసే ట్యాబ్‌లు అందజేస్తారు. రూ.10 వేల విలువ చేసే టీఎల్‌ఎం కిట్లు పంపిణీ చేస్తారు.
- ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు వారికి స్టైఫండ్ అందిస్తారు.
- ఒక్కో కిట్‌లో రూ.1500 నుంచి రూ.15వేలు ఖరీదు చేసే ఉపకరణాలను ఉచితంగా అందజేస్తారు. భవిత కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు నెలకు రూ.300 చొప్పున 'ట్రాన్స్‌పోర్టు అలవెన్స్' ఇస్తారు.
- నడవలేని విద్యార్థులను స్కూల్‌కు తీసుకువచ్చే వారికి 'ఎస్కార్ట్ అలవెన్స్' అందజేస్తారు.
- చదవలేని విద్యార్థులకు చదివి వినిపించే వారికి 'రీడర్ అలవెన్స్'గా రూ.300 అందజేస్తారు.
- సదరం సర్టిఫికెట్స్ జారీ చేయించి ప్రభుత్వ పెన్షన్, రాయితీలు వచ్చేలా చూస్తారు. అలాగే ఇన్స్యూరెన్స్ సదుపాయాన్ని కూడా వర్తింపజేస్తారు.



శ్రీకాకుళం భవిత కేంద్రం



శ్రీకాకుళంలోని మడ్డివీధిలో రుత్విక్, నిరుపమ అనే పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ ఆర్.జయప్రకాష్

శరవేగంగా సర్వే..

మొత్తం భవిత కేంద్రాలు	ప్రత్యేక అవసరాల పిల్లలు సంఖ్య	భవిత కేంద్రాల్లో చదువుతున్నవారు	తాజాగా గుర్తించిన బాలల సంఖ్య	భవిత కేంద్రాల్లో పని చేస్తున్న ఐటీఆర్టీ టీచర్లు	ఐఈడీఎస్‌ఎస్‌ల్లో పనిచేస్తున్నవారి సంఖ్య	భవిత కేంద్రాల్లో సీజీవీల సంఖ్య	ఫిజియోథెరపీ వైద్యుల సంఖ్య
30	4450	725	480	60	35	30	10

తల్లిదండ్రుల్లో చైతన్యం రావాలి



ప్రత్యేక అవసరాలు గల పిల్లలను బడుల్లో చేర్పించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రభుత్వం అందించే అన్ని సౌకర్యాలు పొందగలుగుతారు. జాతీయ ఉపకార వేతనం కింద ఏడాదికి రూ.9 వేల నుంచి రూ.11 వేలు మంజూరవుతాయి. వీటికి తోడు పింఛన్లు, రాయితీలకు అవసరమైన సర్టిఫికెట్లు, అలవెన్సులు, ఉచిత ఉపకరణాలు ఇలా ప్రతి ఒక్కటి ప్రభుత్వమే అందజేస్తుంది. వైకల్యం ఉందని బాధపడకుండా పిల్లలను బడులకు పంపాలి. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలపై ముందుగా పిల్లల తల్లిదండ్రుల్లో చైతన్యం రావాలి. స్వచ్ఛందంగా వారే ముందుకురావాలి.

– బుడుమూరు గోవిందరావు, సహిత విద్య కోఆర్డినేటర్, సమగ్రశిక్ష శ్రీకాకుళం

జిల్లాలో ఇదీ పరిస్థితి..



సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోంది. ప్రజల్లో సరైన అవగాహన లేక ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులు వీటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. అంగవైకల్యంతో పుట్టిన తమ పిల్లలను నాలుగు గోడల మధ్యకే పరిమితం చేస్తున్నారు. ఇలాంటి వారందరినీ పాఠశాలలో చేర్పించేందుకు విస్తృతంగా ఇంటింటి సర్వే చేస్తున్నాం.

– డాక్టర్ రోణంకి జయప్రకాష్, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, సమగ్ర శిక్ష శ్రీకాకుళం

పలాస కిడ్నీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు



ఆరోగ్య శ్రీ ద్వారా హెర్నియా ఆపరేషన్ చేసుకున్న వ్యక్తితో డాక్టర్ల బృందం

కాశీబుగ్గ: పలాసలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన కిడ్నీ పరిశోధన కేంద్రంలో డయాలసిస్ యూనిట్‌కు ఆరోగ్యశ్రీ సేవలు అందించేందుకు అనుమతులు మంజూరయ్యాయని పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ సోమవారం తెలిపారు. ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు, ఆపరేషన్‌లు, మందులు అన్ని రకాల సౌకర్యాలు ఆరోగ్యశ్రీలో పొందవచ్చునని, ఉద్దానం కిడ్నీ బాధితులే కాకుండా ఇతర వ్యాధులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు పలాస కిడ్నీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, వారిని సంప్రదించాలని కోరారు.

ఆరోగ్య శ్రీలో తొలి ఆపరేషన్



పలాస కిడ్నీ ఆస్పత్రిలో సోమవారం ఆరోగ్య శ్రీలో భాగంగా తొలి హెర్నియా ఆపరేషన్ పూర్తి చేశారు. డాక్టర్ కూర్మారావు, డాక్టర్ సురేష్‌లు ఆరోగ్యశ్రీలో భాగంగా ఉచితంగా ఆపరేషన్ చేశారు. కిడ్నీ ఆస్పత్రికి ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులోకి వచ్చాయని, ఆన్‌లైన్‌లో అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన వివరాలు తెలుసుకుని ఉచిత వైద్యం పొందవచ్చునని సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ తెలిపారు. కిడ్నీ వ్యాధులకు శస్త్ర చికిత్స, ఐసీయూ, అల్ట్రాసోనోక్, ఎంఆర్ స్కాన్, ఇతర వైద్య పరీక్షలు అన్ని ఆరోగ్యశ్రీ ఉచితంగా పొందవచ్చునని అన్నారు.

ఓట్ల లెక్కింపునకు ముమ్మర ఏర్పాట్లు

14 టేబుళ్ల ఏర్పాటు • 173 రౌండ్లలో లెక్కింపు

నియోజకవర్గం	టేబుళ్లు	రౌండ్లు
ఇచ్ఛాపురం	14	22
పలాస	14	21
టెక్కలి	14	23
పాతపట్నం	14	24
శ్రీకాకుళం	14	20
ఆమదాలవలస	14	19
నరసన్నపేట	14	21
ఎచ్చెర్ల	14	23



శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు జిల్లా యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. జూన్ 4వ తేదీన ఎచ్చెర్ల మండలంలోని చిలకపాలేం వద్ద గల శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో లెక్కింపు జరగనుంది. జిల్లాలోని ఒక పార్లమెంటు స్థానం అంటే శ్రీకాకుళం, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు ఈ ఓట్లు లెక్కింపు జరగనుంది. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు వేర్వేరుగా కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

పార్లమెంటు స్థానానికి జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 173 రౌండ్లలో లెక్కిస్తారు. శ్రీకాకుళం పార్లమెంటు స్థానానికి ఏడు గదులు, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు గాను 8 గదులు ఏర్పాటు చేశారు. ఒక్కో గదిలో 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఇలా మొత్తంగా 112 టేబుళ్లపై 173 రౌండ్లలో లెక్కింపు ఫలితాలు అందజేసేందుకు సన్నాహాలు చేశారు. ప్రతి నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో లెక్కింపు ఉంటుంది.

పోస్టల్ బ్యాలెట్లు ఇక్కడే..

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కూడా ఇక్కడే జరగనుంది. ప్రారంభంలోనే ఈ పోస్టల్ ఓట్లను లెక్కిస్తారు. శ్రీకాకుళం ఎంపీ స్థానానికి 38,865 పోస్టల్ బ్యాలెట్లు ఇప్పటి వరకు వచ్చాయి. హోం ఓటింగ్‌లో 556, ఉద్యోగ, ఉపాధ్యాయులు 22,797 మంది, సర్వీసు ఓటర్లు 15,512 మంది ఈ ఎన్నికల్లో ఓటు వేశారు. సర్వీసు ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కౌంటింగ్ ముందు రోజు వరకు ఈ ఓట్లను తీసుకుంటారు. వీరి ఓట్ల లెక్కింపునకు ఒక గదిని కేటాయించారు. మొత్తం 30 టేబుళ్లు 30 మంది ఈఆర్వోలను వినియోగించనున్నారు. ఈ ఓట్లకు సంబంధించి 20 స్కానర్లు ఏర్పాటు చేస్తున్నారు. 8 అసెంబ్లీ స్థానాల్లో హోమ్ ఓటింగ్ ద్వారా 662 మంది, ఉద్యోగ, ఉపాధ్యాయులు 25,164, సర్వీసు ఓటర్లు 16,448 మంది ఓటు వేశారు. మొత్తం 42,274 పోస్టల్ బ్యాలెట్లు లెక్కించేందుకు 8 గదులను కేటాయించారు. 29 టేబుళ్లు, 37 మంది ఈఆర్వోలను వినియోగించనున్నారు. 80 స్కానర్లు కూడా అందుబాటులో ఉంచారు.

కౌంటింగ్‌కు పటిష్ట చర్యలు



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఎచ్చెర్ల క్యాంపస్: జూన్ 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణ, భద్రత చర్యలపై చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో సోమవారం ఆయన అధికారులతో చర్చించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలకు సెల్‌ఫోన్ నిషేధిస్తున్నట్లు చెప్పారు. అన్ని నియోజక వర్గాలకు సంబంధించి ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో డ్రై రన్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు పూర్తయి, ఫలితాలు ప్రకటించి అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎన్నికల నియమావళి, ఎన్నికలు సంఘం నిబంధనలు పాటించాలని అన్నారు. ఏజెంట్ల ప్రవేశం సమయంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలించారు. భద్రతపై ఎస్పీ జీఆర్ రాధికతో చర్చించారు. డ్రై రన్ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఆర్వోలు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సూర్యప్రభ వాహన సేవ

- ముగిసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



సూర్యప్రభ వాహన సేవలో స్వామి వారి ఊరేగింపు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామికి సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. ఈ వాహనంలో స్వామి ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. ఆలయం వద్ద సూర్యప్రభ వాహన సేవను ఆలయ ట్రస్టీ ప్రతినిధులు పి.వీరభద్రస్వామి, పి.కృష్ణ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పాగోటి రాజారావు తదితరులు ప్రారంభించారు. సూర్యప్రభ వాహన సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో పరిసరాల్లో ఉన్న వేద పండితులు 50 మంది పాల్గొన్నారు. మంగళవారం ఆలయం వద్ద స్వామికి పుష్ప యాగం, బుధవారం అన్నదానం నిర్వహిస్తామని బ్రహ్మోత్సవాల కమిటీ ప్రతినిధులు మావుడూరి జగదీష్ బాబు, జోష్యుల జగన్నాథశర్మ, అర్చకులు చామర్తి సత్యసాయి కృష్ణమాచార్యులు తెలిపారు.

'జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి'



ఆర్డీఓ కార్యాలయం వద్ద ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న రైతు కూలీ సంఘం ప్రతినిధులు

పలాస: జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పలాస జీడి పప్పు పరిశ్రమలకు ముడి సరుకైన జీడి పిక్కలను అందిస్తున్న ఉద్దానం ప్రాంతం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు కోరారు. ఈ మేరకు పలాస ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 80 కిలోల బస్తా జీడి పిక్కలకు కనీసం రూ.16వేలు మద్దతు ధర ఇవ్వాలని అనేక ప్రజాసంఘాలు కలిసికట్టుగా పోరాటం చేస్తున్నాయని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి నేరుగా రైతు భరోసా కేంద్రాలు ద్వారా పిక్కలను కొనుగోలు చేయాలని కోరారు. జీడి రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని, స్వదేశీ పిక్కలను అమ్మే వరకు విదేశీ పిక్కల దిగుమతులపై నిషేధం విధించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వంకల పాపయ్య, జుత్తు వీరాస్వామి, వినోద్, చంద్రయ్య, కోదండరావు, మాధవరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ ప్రారంభం



పాలిసెట్ ర్యాంకర్ల సర్టిఫికెట్ వెరిఫికేషన్



రిజిస్ట్రేషన్ కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: పాలీసెట్–2024 పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమైంది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రంలో కౌన్సెలింగ్ ప్రారంభించారు. మొదటి రోజు 1 నుంచి 12000 మధ్య ర్యాంకు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఓసీ, బీసీ 237, ఎస్సీ 6 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించి హాజరైన విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు ర్యాంకు బట్టి పరిశీలిస్తున్నారు. రెండో రోజు మంగళవారం 12001 నుంచి 27000 ర్యాంకు వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వర్తించే విద్యార్థుల అర్హత పత్రాలను బీసీ సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. సహాయ కేంద్రంలో కౌన్సెలింగ్‌లో భాగంగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన జూన్ 3వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రత్యేక కేటగిరీ, రిజర్వేషన్ ఎన్‌సీసీ, ఆంగ్లో ఇండియన్, స్పోర్ట్సు, గేమ్స్, పీడబ్ల్యూడీ, స్కౌట్ అండ్ గౌడ్ వంటి వారికి విజయవాడ ప్రభుత్వ పాఠశాలలో ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులు ఈ నెల 31 నుంచి జూన్ 4వ తేదీ వరకు కళాశాలల, బ్రాంచ్‌ల ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. జూన్ 5వ తేదీన ఆప్షన్ల మార్పు, జూన్ 7న కళాశాలల, బ్రాంచ్‌ల అలాట్‌మెంట్‌ల ప్రకటన ఉంటుంది. కౌన్సెలింగ్ ప్రక్రియను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దామోదర్‌రావు, అధ్యాపకులు మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి



ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసులు సీజ్ చేసిన వాహనాలు పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: స్టేషన్ పరిధిలో ఉన్న పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలు, ఫైళ్లు, పెండింగ్ కేసుల రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రస్తుత కేసుల పరిస్థితి ఎస్‌ఐ ఎస్.చిరంజీవిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. సీజ్ చేసిన వాహనాలు కోర్టు ఆదేశాలకు అనుగుణంగా రిలీజ్, డిస్పోజల్ చేయాలని తెలిపారు. త్వరలో ఎన్నికల ఫలితాలు రానున్న నేపథ్యంలో గ్రామాల్లో ట్రబుల్ మాంగర్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలని చెప్పారు. గతంలో హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్న గ్రామాలు, నేర చరిత్ర ఉన్న వారిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అన్నారు. 107 బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఫలితాల అనంతరం ఎలాంటి అల్లర్లు, హింసాత్మక సంఘటనలు, ఘర్షణలు చోటు చేసుకోకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని అన్నారు.

క్లుప్తంగా

పద్మావతి నేత్రాలు సజీవం



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పట్టణంలోని ప్రకాష్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఎల్.పద్మావతి (97) అనారోగ్య కారణాలతో మృతి చెందారు. జెమ్స్ ఆస్పత్రిలో అవయవ దానం చేశారు. ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఐ టెక్నీషియన్ సుజాత, ఉమాశంకర్‌లు ఆమె నేత్రాలను సేకరించారు. మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ద్వారా ఆమె కార్నియాలను సేకరించి విశాఖ, ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందించారు. నేత్రదానం చేసిన వారి కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అభినందించారు. ఎవరైనా నేత్రదానం చేయాలనుకుంటే 7842699321 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

'నిబంధనలు పాటించాలి'



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు

సోంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులు విద్యాశాఖ, ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో పాఠశాలల మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వంటలో చేపట్టాల్సిన మెలకువలు, నియమ నిబంధనలు శిక్షకురాలు యు.లక్ష్మి తెలియజేశారు. శిక్షణ కార్యక్రమాన్ని విద్యాశాఖాధికారి పరిశీలించి సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు ఎస్.జొరాడు, జె.కృష్ణంరాజు, విద్యావనరుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉద్యోగ కల్పనే లక్ష్యం

- శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవం
- హాజరైన స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ చదలవాడ నాగరాణి



ఉద్యోగ విజయోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న స్టేట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నాగరాణి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో వంద శాతం ప్లేస్‌మెంట్‌లు లక్ష్యంగా ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ) డైరెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఉద్యోగ విజయోత్సవం (జాబ్ అచీవర్స్ డే) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చివరి ఏడాది చదువుతున్న పాలిటెక్నిక్ డిప్లమా విద్యార్థులు 209 మంది 14 పరిశ్రమల్లో ఉద్యోగాలు సాధించారు. క్యాంపస్ ఎంపికల్లో సత్తాచాటారు. ఈ విద్యార్థులను ఉద్యోగ విజయోత్సవంలో అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. డైరెక్టర్ మాట్లాడుతూ రూ. 2.54 లక్షలు వార్షిక ప్యాకేజీ నుంచి రూ.1.02 లక్షలు ప్యాకేజీ మధ్య విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను పూర్తిస్థాయిలో బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. రిలీవ్ నాటికి ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించేలా నైపుణ్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కరిక్యులమ్, సిలబస్‌లో మార్పులు, పక్కాగా ప్రయోగాల నిర్వహణ, ఇంటర్న్‌షిప్ వంటివి అమలు చేస్తున్నట్లు చెప్పారు. పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రారంభమైందని, జూన్ 3వ తేదీ వరకు కొనసాగుతుందని అన్నారు. ప్రభుత్వ కళాశాల్లో చేరేందుకు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలని వివరించారు. జిల్లాలో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్, శ్రీకాకుళం మహిళల ప్రభుత్వ పాలిటెక్నిక్, టెక్కలి, ఆమదాలవలస, సీతంపేట పాలిటెక్నిక్‌ల్లో 780 సీట్లు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది 142025 మంది పాలిసెట్ -2024 పరీక్ష రాయగా, 124430 మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు. పాలిటెక్నిక్‌లో చేరిన విద్యార్థుల్లో నైపుణ్య కల్పన, ఉద్యోగ సాధనలకు ప్రాధాన్యత నిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంవీ రామకృష్ణ, ప్రిన్సిపాల్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ బి.జానకిరామయ్య, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, టీపీ వో పి.యుగంధర్, అధ్యాపకులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

అమరులకు ఘనంగా నివాళి

- బొడ్డపాడులో ఘనంగా అమరుల సంస్మరణ సభ



మాట్లాడుతున్న విరసం నేత అరసవెల్లి కృష్ణ

పలాస: నాడు నక్సల్బరీ, శ్రీకాకుళం గిరిజనులు చేపట్టిన పోరాటాల కొనసాగింపే నేడు దండకారణ్యంలో జరుగుతున్న ఆదివాసీల పోరాటాలని విరసం అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ అన్నారు. పలాస మండలం బొడ్డపాడులోని జిల్లా అమరవీరుల స్మారక మందిరం వద్ద అమరుల బంధు మిత్రుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అమరవీరుల స్మారక సభను నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ అధ్యక్షతన జరిగిన సభలో విరసం అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అమరుల పోరాట బాటలోనే నేడు ప్రజలు పాల్గొని తమ సమస్యలను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. దండకారణ్యంలో గిరిజనులు పెద్ద ఎత్తున సహ జ వనరుల పరిరక్షణ కోసం పోరాటాలు చేస్తున్నారని, అయితే పాలక వర్గాలు ఆ సంపదను కాజేయడానికి చూస్తున్నాయని విమర్శించారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో బూటకపు ఎదురు కాల్పులు జరుపుతూ అమాయకులైన ఆదివాసీలను చంపుతున్నారని, మణిపూర్ కంటే ఘోరంగా అక్కడి పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 29న నిజ నిర్ధారణ కమిటీ ఆ ప్రాంతాన్ని పర్యటించి అక్కడ పరిస్థితులను పరిశీలిస్తుందని అందుకు బుద్ధి జీవులంతా సహకరించి మద్దతు తెలిపాలని ఆయన కోరారు. ఈ సభ సందర్భంగా ముందుగా అమరవీరుడు అజాద్ తండ్రి లక్ష్మణరావు వే దిక ముందు అరుణ పతాకాన్ని ఎగురవేశారు. అ నంతరం జరిగిన కార్యక్రమంలో పీడీఎం నాయకుడు వై.కోటేశ్వరరావు, డీటీఎఫ్ నాయకుడు కోత ధర్మారావు, ఏఎంపీఎస్ నాయకుడు ప్రభాకర్, ఏబీ ఎం సహాయక కార్యదర్శి భవాని, జోగి కోదండరావు, దాసిరి శ్రీరాములు, తామాడ త్రిలోచనరా వు, బొడ్డపాడు యువజన సంఘం నాయకులు తా మాడ క్రాంతి, బత్తిన వాసు, బి.సింహాద్రి, దశరథ, రాజాం గుణవంతు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధునికి సన్మానం



శతాధిక వృద్ధుడు ఇప్పిలి తుంబనాథంను సన్మానిస్తున్న నేతలు

కంచిలి: మండలంలోని కేసరపడ గ్రామానికి చెందిన వందేళ్లు పూర్తిచేసుకొన్న వృద్ధుడు ఇప్పిలి తుంబనాథంను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. వేర్వేరు చోట్ల ఉన్న ఈ వృద్ధుని కుమారులు, కుమార్తె, మిగతా కుటుంబసభ్యులు, బంధువులు అంతా ఒకచోట చేరి సత్కరించి, గ్రామస్తులందరికీ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత ఇప్పిలి కృష్ణారావు, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు మెండ హేమావతి, ఆమె భర్త ప్రకాశరావు, వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నేతలు కప్పల యుగంధర్, మెండ మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బలరాంపురంలో కార్డన్ సెర్చ్

గార: మత్స్యకార గ్రామమైన బలరాంపురంలో సోమవారం వేకువజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ బృందం గ్రామంలోని వీధులన్నీ జల్లెడ పట్టారు.

ఐదు వాహనాలకు ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో వాటిని అదుపులోకి తీసుకున్నారు. వాహన యజమానులు సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో పత్రాలు అందించడంతో వాహనాలను తిరిగి అప్పగించారు.

పశువులను తరలిస్తున్న వాహనాలు సీజ్

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని చింతాడ సంత నుంచి అక్రమంగా తరలిస్తున్న పశువులను రూరల్ పోలీసులు సోమవారం గుర్తించారు. శ్రీకాకుళం నుంచి విజయవాడ కేంద్రంగా తరలిస్తున్న 25 పశువులను అలాగే విశాఖ కేంద్రంగా తరలిస్తున్న 12 పశువులను పట్టుకొని గో సంరక్షణ కేంద్రానికి అప్పగించారు. పశువులకు ఉపయోగించిన లారీలను రూరల్ పోలీసులు సీజ్ చేశారు. రూరల్ ఎస్ఐ వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద రీతిలో జీడి కార్మికుడు మృతి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సూదికొండ ప్రాంతంలో సోమవారం ఓ జీడి కార్మికుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఇతని మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించడం స్థానికంగా సంచలనంగా మారింది. 02వ వార్డు నెమలికొండ కొండపై ఉన్న జీడిచెట్టుకు 19వ వార్డు సూదికొండకు చెందిన గనే బాబురావు(46) మృతదేహం వేలాడుతుండడాన్ని స్థానికులు గమనించి కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. అయితే ఇది హత్యా, ఆత్మహత్యా అన్న విషయం దర్యాప్తు అనంతరం తేలుస్తామని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉండగా వారి సమక్షంలో మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

మేడ మీద నుంచి జారిపడి వ్యక్తి మృతి



సత్యనారాయణ

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని గూనపాలెంలో నివాసముంటున్న ఓ వ్యక్తి మేడ మీద నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందారు. ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల మేరకు.. దూగాన సత్యనారాయణ (42) వంట మాస్టారుగా పనిచేసుకుంటూ తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఐదేళ్లుగా గూనపాలెంలోని అద్దె ఇంటిలో నివసిస్తున్నారు. భార్య విజయలక్ష్మి చేగొడియాల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి తొమ్మిది గంటలకు సత్యనారాయణ వంట పనులు ముగించుకుని ఇంటికి వచ్చి భోజనం చేసిన తర్వాత కుటుంబ సభ్యులతో సరదాగా మాట్లాడుతూ రాత్రి 12 గంటల వరకు గడిపారు. వేసవి ఉక్కబోత కారణంగా ఇంటిపైన రెండో ఫ్లోర్ మేడ మీద పడుకుంటానని భార్య, కుమార్తెలతో చెప్పి వెళ్లారు. సోమవారం వేకువజాము ఐదు గంటల సమయంలో పక్కింటిలో నివసిస్తున్న ఆర్.పద్మావతి వచ్చి విజయలక్ష్మిని లేపి నీ భర్త పెరడులో ఉన్న బురదగుంట, ముళ్లకంప మధ్యలో గాయాలతో పడి ఉన్నాడని చెప్పడంతో ఆమె వెళ్లి చూసే సరికి.. సత్యనారాయణ కొన వూపిరితో పడి ఉన్నాడు. తలకు బలమైన గాయమైంది. దీంతో ఆటోమీద హుటాహుటిన రిమ్స్‌కు తీసుకెళ్లారు. అయితే ఉదయం 6.30కు ఆయన చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మేడపై భాగాన ఎలాంటి పిట్ట గోడ లేకపోవడంతో నిద్రలో దొర్లుకుంటూ తన భర్త కింద పడిపోయి ఉంటాడని భార్య విజయలక్ష్మి చెప్పడంతో ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పాత వస్తువుల గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

- రూ. 50 లక్షలకు పైగా ఆస్తినష్టం



వేకువజామున ఎగిసి పడుతున్న మంటలు

నరసన్నపేట: జాతీయ రహదారి-16 సర్వీసు రోడ్డును ఆనుకొని స్థానిక హెచ్‌పీ గిడ్డంగి వద్ద ఉన్న పాత వస్తువుల గోడౌన్‌లో సోమవారం వేకువజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో చాలా గంటల పాటు అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. ఆ మార్గంలో ప్రయాణించడానికే వాహనదారులు భయపడ్డారు. పక్కనే ఉన్న హెచ్‌పీ గోడౌన్‌కు ఈ ప్రమాద వేడి రావడంతో ముందు జాగ్రత్త చర్యగా గ్యాస్ సిలెండర్లను అక్కడి నుంచి తరలించారు. గిడ్డంగిలో ప్రమాద సమయానికి 90 టన్నులకు పైగా వివిధ పాత వస్తువులు ఉన్నట్లు సమాచారం. ప్లాస్టిక్ వస్తువులతో పాటు ఇనుప వస్తువులు, వాటర్ బాటిల్స్, వివిధ రకాల మిషన్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రమాదంలో రూ. 50 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగి ఉంటుందని గిడ్డంగి యజమాని కోరాడ వైకుంఠరావు (బుజ్జి) తెలిపారు. కాగా ప్రమాద సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే వాతావరణం అనుకూలించకపోవడం గాలి తీవ్రత అధికంగా ఉండటంతో మంటలను అదుపు చేయలేకపోయారు. సాయంత్రం వరకూ దట్టమైన పొగ ఆ ప్రాంతంలో జనాలను ఉక్కిరిబిక్కిరి చేసింది. వేకువజాము 3 గంటల నుంచి ఉదయం 10 వరకూ మంటలు వస్తూనే ఉన్నాయి. దీనిపై యజమాని స్పందిస్తూ ఇది ప్రమాదం కాదని, కావాలనే కొందరు నాలుగు వైపులా మంటలు పెట్టి ఉంటారని వైకుంఠరావు అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం మంటలను అదుపు చేశారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన రేగాన ఆనందరావు పూరిల్లు

బూర్జ: మండలంలో గల లక్కుపురం గ్రామంలో రేగాన ఆనందరావు అనే వ్యక్తికి చెందిన పూరిల్లు సోమవారం అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. గ్రామస్తులు, పాలకొండ అగ్నిమాపక సిబ్బంది తెలియజేసిన వివరాలు ప్రకారం.. లక్కుపురం ఎస్సీ కాలనీలో అగ్ని ప్రమారం సంభవించి ఇల్లు కాలి పెద్ద మంటలు రావడంతో స్థానికులు, ఇంటి యజమాని గమనించి పాలకొండ అగ్నిమాపక వాహనానికి సమాచారం అందజేశారు. ఆ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఇంటిలో ఉన్న వారికి ఎవరికీ ఏమీ కాలేదు. ఇంట్లో ఉన్న బంగారం, రూ.50 వేలు నగదు, వంట సామగ్రి, ఫర్నీచర్, బట్టలు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, మంటలకు ఆహుతైనట్లు పాలకొండ అగ్నిమాపక అధికారి జె.సర్వేశ్వరరావు తెలిపారు. నష్టం సుమారు రూ. 2.50 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

లండన్ మ్యాగ్‌జైన్‌లో కుప్పిలి కవితకు స్థానం

ఆమదాలవలస రూరల్: లండన్‌కు చెందిన తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ (తాల్) ఉగాది సందర్భంగా విడుదల చేసిన మా తెలుగు 2024 వార్షిక సంచికలో ఆమదాలవలసకు చెందిన కవి కుప్పిలి వెంకటరాజారావు రచించిన కవితకు స్థానం లభించింది. కుప్పిలి రచించిన తనివితీరని తావి- తెలుగు అనే కవితకు స్థానం వచ్చినట్లు లండన్ సంపాదకులు నెల్లుట్ల సునీత మెయిల్ ద్వారా సమాచారం తెలియజేశారని కవి రాజారావు సోమవారం తెలిపారు. భారత రత్న పీవీ నరసింహారావు ముఖచిత్రంతో విడుదల చేసిన ఈ సంచికను ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ ఆవిష్కరించారని తెలిపారు.

లోయలో పడిన ఆటో

- బాలుడి మృతి
- 16 మందికి తీవ్రగాయాలు
- ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం
- వారపు సంత నుంచి ఇంటికి వెళ్తుండగా ప్రమాదం



నుజ్జునుజ్జయిన ఆటో



క్షతగాత్రులను అంబులెన్స్‌లో శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం



మృతిచెందిన కార్తీక్

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట ఏజెన్సీలో వంబరెల్లి ఘాట్‌రోడ్ వద్ద లోయలో సోమవారం ఒక ఆటో బోల్తా పడి ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 17 మందికి తీవ్ర గాయాలు కాగా క్షతగాత్రుల్లో సవర కార్తీక్ (8) అనే బాలుడు మృతిచెందాడు. మరో ఇద్దరి పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ ప్రమాద సంఘటన వివరాలిలా ఉన్నాయి. సీతంపేట మండలంలోని వంబరెల్లి, దీసరిగూడ, బుడ్డడుగూడ పరిసర గ్రామాలకు చెందిన గిరిజనులు సీతంపేటలో జరిగే వారపు సంతకు వచ్చి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుని తిరుగు ప్రయాణంలో ఒకే ఆటోలో 17 మంది ప్రయాణిస్తున్నారు. వంబరెల్లి రహదారి పూర్తిగా ఘాట్ రోడ్ కావడంతో ఆటో పైకి కొండ ఎక్కుతున్న సమయంలో డ్రైవర్ అదుపు చేయలేకపోవడంతో వెనక్కువచ్చి వంద అడుగుల లోయలో పడింది. దీంతో ఆటో నుజ్జునుజ్జయింది. ఒక్కసారిగా ప్రయాణికులంతా హాహాకారాలు చేశారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఒకరు దూకి ప్రాణాలు దక్కించుకున్నారు. సవర లక్ష్మి, సవరకార్తీక్, డొంబయ్య, అనిత, కవిత, సుక్కమ్మ, తిక్కమ్మ, అడ్డాయి, బెన్నయ్య, ఉషా, తుంపమ్మ, లాస్య, నవీన్, సుక్కమ్మ, రమణ, మధు, సాంబయ్యలకు గాయాలయ్యాయి. వారిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా ప్రధాన వైద్యాధికారి శ్రీనివాసరావు, సివిల్ సర్జన్ శ్రీనివాసరావు, రాజేష్ తదితరులు ప్రాథమిక వైద్యసేవలందించారు. క్షతగాత్రుల పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో 11మంది, జెమ్స్ ఆస్పత్రిలో ఇద్దరు, పాలకొండలో ఒకరు, సీతంపేట హాస్పిటల్‌లో ముగ్గురు చికిత్స పొందుతున్నారు. జెమ్స్‌లో చికిత్స పొందుతున్న కార్తీక్ మృతి చెందాడు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సవర లక్ష్మి, సవర అనితల పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

అలుముకున్న విషాదఛాయలు

ఆటో లోయలో పడిన విషయం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు భారీ ఎత్తున సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రత్యేక వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

ఆటో లోయలో పడి 17 మందికి గాయాలపాలైన సంఘటన తెలుసుకున్న ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ డీవీజీ శంకరరావు, పాలకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతిలు స్పందించారు. ఆటో ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం బన్సల్‌తో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించే విధంగా చూడాలని కోరారు. సీతంపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, శ్రీకాకుళం రిమ్స్, జెమ్స్ ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలని కోరారు. ఎంపీపీ బి.ఆదినారాయణతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు సీతంపేట ఏరియా ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు.

చల్లవానిపేటలో రూ. 5లక్షలు చోరీ

జలుమూరు: మండల పరిధి చల్లవానిపేట జంక్షన్‌లో సోమవారం రూ. ఐదు లక్షలు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సారవకోట మండలం చీడిపూడికి చెందిన పొన్నాన ఝాన్సీ తన భర్త గణపతిరావుతో కలిసి ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఆమె నెలవారీ కొంత సొమ్మును చల్లవానిపేట భారతీయ స్టేట్ బ్యాంక్‌లో పొదుపు(రికరింగ్ డిపాజిట్) చేసేవారు. ఆర్‌డీ కాలపరిమితి ముగియంగా చల్లవానిపేట స్టేట్ బ్యాంక్ నుంచి విత్‌డ్రా చేశారు. డబ్బును తన ద్విచక్ర వాహనంలో భద్రపరిచి చల్లవానిపేట జంక్షన్ వద్ద జ్యూస్ తాగి అదే వాహనంలో ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చాక వాహనంలో ఉన్న డబ్బును తీసేందుకు చూడగా కనిపించలేదు. దీంతో లబోదిబో మంటూ బ్యాంక్, చల్లవానిపేట పరిసరాలకు వచ్చి వెతికారు. ఫలితం లేకపోవడంతో సాయంత్రం జలుమూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ మధుసూదనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీ ప్రసాద్ కుటుంబానికి ఫ్లాగ్ ఫండ్ అందజేత



ఫండ్ చెక్‌లను అందజేస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: నౌపడ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెచ్‌సీ కె.ప్రసాద్ అనారోగ్యంతో ఇటీవల మరణించడంతో కుటుంబ సభ్యులకు ఎస్పీ జీఆర్ రాధిక చేతుల మీదుగా ఫ్లాగ్ ఫండ్ అందజేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో శాఖాపరమైన ఫ్లాగ్ ఫండ్ రూ.50 వేలు, విడో ఫండ్ రూ. 25వేలు చెక్‌లను అందజేశారు. శాఖాపరంగా రావాల్సిన ప్రయోజనాలను త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రేమ కాజల్, ఏఓ గోపీనాద్ ఉన్నారు.

'హద్దు మీరితే చర్యలు తప్పవు'



మాట్లాడుతున్న టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి

పాతపట్నం: జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని టెక్కలి డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి అన్నారు. పాతపట్నం పోలీస్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని పాతపట్నం, మెళియాపుట్టి మండలాలకు చెందిన పార్టీ నాయకులకు, గ్రామ పెద్దలకు ఎన్నికల కోడ్‌పై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు చేసినా చర్యలు తీసుకుంటామని, బాణసంచా నిషేధమని, అలాకాదని ఎవరైనా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురు కంటే ఎక్కువ మంది గుంపులుగా తిరగవద్దని సూచించారు. ఇప్పటికే గొడవలు, కేసుల్లో ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టామని, అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించే వారిపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సీఐ నల్లి సాయి, పాతపట్నం, మెళియాపుట్టి ఎస్ఐలు మహమ్మద్ యాసీన్, రాజేష్ ఉన్నారు.

ఆటో ఢీకొని మహిళకు గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని పాతబస్టాండు సమీపంలోని పందంపుళ్ల జంక్షన్ వద్ద ఆటో ఢీకొని మహిళకు గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుడివీధిలో నివాసముంటున్న మలిపెద్ది శశికళ అనే మహిళ తన స్నేహితురాలు పార్వతితో కలిసి ఆదివారం పాత మార్కెట్‌కు వెళ్లింది. సామాన్లు కొని ఇంటికి వస్తుండగా పందుంపుళ్ల కూడలి వద్ద వెనుకగా వచ్చిన ఆటో శశికళను ఢీకొట్టడంతో ఆమె రోడ్డుపై పడిపోయింది. వెంటనే ఆమెను రిమ్స్‌లో చేర్పించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాదరావు చెప్పారు.